క్లుప్తంగా

వాహనాల వేలం రేపు

జియ్యమ్మవలస: మండలంలోని చినమేరంగి పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన సారా కేసుల్లో పట్టుబడిన వాహనాలను ఈ నెల 11వ తేదీన వేలం వేస్తున్నట్లు ఎస్ఐ కళాధర్ ఓ ప్రకటనలో గురువారం వెల్లడించారు. పాలకొండ సబ్‌డివిజన్ డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్, చినమేరంగి పోలీస్ సంయుక్త ఆధ్వర్యంలో ఏడు ద్విచక్ర వాహనాలను వేలం వేస్తున్నామన్నారు. ఉదయం 10 గంటలకు జరిగే వేలంలో పాల్గొనే వారు తప్పనిసరిగా ఆధార్‌కార్డు సమర్పించి, రూ.1000 డిపాజిట్ చేయాలన్నారు.

శంకుస్థాపన



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే కళావతి

సీతంపేట: మండలంలోని కుశిమిలో టీటీడీ ఆధ్వర్యంలో నిర్మించనున్న గ్రామదేవత ఆలయానికి పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిశీలన..



సీతంపేట ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల ప్రయోగాలను పరిశీలిస్తున్న అధికారులు

సీతంపేట: సీతంపేట, దోనుబాయి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో నిర్వహించబడుతున్న అటల్ టింకరింగ్ ల్యాబ్‌ను స్టేట్ అటల్ టాస్క్‌ఫోర్స్ టీమ్ సభ్యులు ఎస్. ప్రవీణ, లక్ష్మణ గురువారం పరిశీలించారు. ల్యాబ్‌లను విద్యార్థులు ఎలా వినియోగించుకుంటున్నదీ ఆరా తీశారు. ప్రయోగాలు ఎలా చేస్తున్నారనేది పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు ఎ.లిల్లీరాణి, కె.సుబ్బారావు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి



సవర భాషా విద్యావలంటీర్లకు ఇస్తున్న శిక్షణను పరిశీలిస్తున్న పార్వతీపురం ఐటీడీఏ డీడీ శ్రీనివాసరావు

గుమ్మలక్ష్మీపురం: విద్యార్థులకు అర్థమయ్యే విధంగా విద్యాబోధన చేయాలని పార్వతీపురం ఐటీడీఏ డీడీ కె.శ్రీనివాసరావు సూచించారు. స్థానిక వైటీసీలో సవర భాషా విద్యావలంటీర్లకు రెండు రోజులుగా ఇస్తున్న నైపుణ్య శిక్షణ గురువారం ముగిసింది. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన బోధనా సామర్థ్యం మెరుగు కోసం ఇచ్చే ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని, ఇక్కడ నేర్పించే ప్రతీ అంశాన్ని అనుసరించి, విద్యార్థులకు బోధించాలని కోరారు. విద్యార్థుల భాషలో విద్య నేర్పితే వారికి బాగా అర్థమవుతుందన్నారు. పార్వతీపురం ఐటీడీఏ సౌజన్యంతో నిర్వహించిన శిక్షణలో 176 మంది సవర భాషా విద్యావలంటీర్లు పాల్గొన్నారు. ఆయన వెంట ఏఎంవో బి.శ్రీనివాసరావు, ఎంఈవో బి.జనార్దనరావు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



గర్భిణుల ఆరోగ్య తనిఖీల రికార్డు పరిశీలిస్తున్న డీఐఓ జగన్‌మోహనరావు

కొమరాడ: హైరిస్క్ గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి(డీఐవో) టి.జగన్‌మోహన్‌రావు సూచించారు. గురువారం మండలంలోని కూనేరు రామభద్రపురం, కొమరాడ పీహెచ్‌సీల్లో నిర్వహించిన ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమాన్ని పరిశీలించిన ఆయన గర్భిణులకు చేసిన ఆరోగ్య తనిఖీల వివరాలను గమనించారు. కార్యక్రమంలో వైద్యుడు అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 18 మంది ఎంపిక

సీతంపేట: స్థానిక వైటీసీలో గురువారం జరిగిన జాబ్‌మేళాలో 18 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. మోండెలెజ్ ఇండియా ఫుడ్స్ చాక్లెట్ కంపెనీ ప్రతినిధులు నిర్వహించిన ఈ జాబ్‌మేళాకు 55 మంది హాజరయ్యారు. అర్హతలు, నైపుణ్యాల ప్రకారం 18 మందిని ఎంపిక చేసినట్లు కంపెనీ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో వైటీసీ మేనేజర్ వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.



కురుపాం: శివ్వన్నపేట సచివాలయం-1లో ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాల బోర్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి, వైఎస్సార్ సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు



జియ్యమ్మవలస: జియ్యమ్మవలస జరిగిన కార్యక్రమంలో జై జగన్, జై వైఎస్సార్ సీపీ నినాదాలు చేస్తున్న పార్టీ నేతలు, కార్యకర్తలు



సీతంపేట: మండల కేంద్రంలోని సచివాలయం వద్ద మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళావతి

ఆంధ్రప్రదేశ్‌కు జగనే కావాలి

వై ఏపీ నీడ్స్ జగన్(ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే) కార్యక్రమంతో గ్రామాలు జై జగన్, జై వైఎస్సార్ సీపీ నినాదాలతో హోరెత్తాయి. ప్రజలకు జగనన్న ప్రభుత్వం చేసిన మేలును వివరించడమే లక్ష్యంగా గురువారం చేపట్టిన ఈ కార్యక్రమంలో నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని నేతలు వివరించారు. సచివాలయాల వద్ద ఏర్పాటు చేసిన పార్టీ జెండాలు, సంక్షేమ పథకాల బోర్డులు ఆవిష్కరించారు. గతంలోని టీడీపీ పాలనకు, ఇప్పటి వైఎస్సార్ సీపీ పాలనకు ఉన్న స్పష్టమైన తేడాను గమనించాలని, మేలు జరిందంటేనే వచ్చే ఎన్నికల్లో ఓటువేసి, గెలిపించాలని కోరారు. ఏ ఇంటికి వెళ్లినా జగనే మళ్లీ మళ్లీ సీఎంగా కావాలని కోరుకుంటుండడం పార్టీ శ్రేణుల్లో మరింత ఉత్సాహం నింపింది. –పాలకొండ, కురుపాం సాక్షి నెట్‌వర్క్.



గరుగుబిల్లి: పెద్దూరులో ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ సంక్షేమ పాలనను వివరిస్తున్న ఎంపీపీ రామారావు, జెడ్పీ వైస్ చైర్మన్ బాపూజీనాయుడు



గుమ్మలక్ష్మీపురం: ఎల్విన్‌పేట సచివాలయం-2లో ప్రభుత్వ పథకాల బోర్డు ఏర్పాటు చేస్తున్న ఎంపీపీ దీనమయ్య, తదితరులు



కొమరాడ: గుమడ గ్రామసచివాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ శ్రేణుల నినాదాలు



పాలకొండ రూరల్: వీవర్స్ కాలనీ సచివాలయం వద్ద సంక్షేమ లబ్ధికి సంబంధించిన బోర్డును ఆవిష్కరిస్తున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు



పాలకొండ: సింగన్నవలసలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు సూర్య ప్రకాశరావు, మన్మథరావు, తదితరులు



వీరఘట్టం: సచివాలయం-1 పరిధిలో మాట్లాడుతున్న ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు



కురుపాం: శివ్వన్నపేటలో జరిగిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమానికి హాజరైన పార్టీ కార్యకర్తలు



భామిని: మండల కేంద్రంలో సంక్షేమ పథకాల జాబితాను ఆవిష్కరిస్తున్న పార్టీ నాయకులు

జగనన్న ఆరోగ్య సురక్షతో ఆరోగ్యం మెరుగు

● ఎమ్మెల్యే కళావతి

సీతంపేట: జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజల ఆరోగ్యాలు మెరుగవుతున్నాయని పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. మండలంలోని కోతాం ముత్యాలు సెంటర్‌లో గురువారం నిర్వహించిన ఆరోగ్య సురక్ష శిబిరానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పల్లె ప్రజలకు కూడా కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆదినారాయణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సుమిత్రరావు, సర్పంచ్ బంగారమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు ఆదమ్మ, గణేష్, తదితరులు పాల్గొన్నారు.



సీతంపేట: వైద్యసేవలపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే కళావతి

రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలి...

పాలకొండ: యువత రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని ఆర్డీఓ ఎం. లావణ్య పిలుపునిచ్చారు. గురువారం స్థానిక తమ్మినాయుడు విద్యాసంస్థల ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రక్తదానం పట్ల ఉన్న అపోహలను విడనాడాలని సూచించారు. రెడ్‌క్రాస్ సంస్థ ప్రతినిధి పెంకి చైతన్యకుమార్, ఏరియా ఆస్పత్రి వైద్య నిపుణుడు జె. రవీంద్రకుమార్ ఆధ్వర్యంలో 113 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో శివ్వాల మన్మథరావు, ఎస్. నారాయణమ్మ, తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.



రక్తదాతలను అభినందిస్తున్న ఆర్డీఓ లావణ్య

జగనన్న కాలనీలో బోరు

భామిని: మండలంలోని నులకజోడు జగనన్న కాలనీలో హ్యాండ్ బోర్ వేసేందుకు సర్పంచ్ కొత్తూరు ప్రసాద్ గురువారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జగనన్న కాలనీ నిర్మాణ పనులకు ఉపయోగపడేలా ముందుస్తుగా బోరు తీయిస్తున్నట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు సాసుపిల్లి ఫాల్గుణరావు, ఎస్.విశ్వనాథం ఆధ్వర్యంలో పనులు ప్రారంభమయ్యాయి.



చేతి బోరుకు భూమి పూజ చేస్తున్న నాయకులు

కబడ్డీ విజేతలకు అభినందనలు

భామిని: మండల కేంద్రంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో ఇంటర్ చదువుతున్న విద్యార్థినులు బిడ్డిక ఆదమ్మ, బిడ్డిక రబికలు అండర్-19 రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచారు. పశ్చిమ గోదావరి జిల్లాలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) క్రీడా పోటీలలో పాల్గొన్న విద్యార్థినులు స్వర్ణ పతకం సాధించడంతో ప్రిన్సిపాల్ రఘుపాత్రుని శివకుమార్, పీడీ జి. శివరామ్‌ప్రసాద్, తదితరులు గురువారం అభినందించారు. కార్యక్రమంలో స్కూల్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



భామిని: విద్యార్థులను అభినందిస్తున్న మోడల్ స్కూల్ సిబ్బంది

న్యాయచట్టాలపై అవగాహన అవసరం



గరుగుబిల్లి: మాట్లాడుతున్న పార్వతీపురం సీనియర్ సివిల్ జడ్జి యజ్ఞనారాయణ



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న అడ్వకేట్ అశోక్ కుమార్

కురుపాం: ప్రతీ పౌరుడికి న్యాయచట్టాలపై అవగాహన చాలా అవసరమని మండల లీగల్ సర్వీసెస్ కమిటీ కురుపాం ప్యానల్ అడ్వకేట్ కె.అశోక్‌కుమార్ అన్నారు. మండలంలోని పూతికవలస గ్రామంలో జాతీయ న్యాయసేవా దినోత్సవం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్తులకు లీగల్ సర్వీసెస్ యాక్ట్, లోక్ అదాలత్, ట్రైబల్ రైట్స్ యాక్ట్, సివిల్ ప్రొసీజర్ కోడ్, చైల్డ్ మ్యారేజ్ యాక్ట్, హిందూ మ్యారేజ్ యాక్ట్‌లపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అడ్వకేట్ కె.హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

గరుగుబిల్లి: ప్రతిఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని పార్వతీపురం సీనియర్ సివిల్ జడ్జి జి.యజ్ఞనారాయణ సూచించారు. జాతీయ న్యాయ సేవా దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో న్యాయ అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన భూ సరిహద్దు తగాదాలు, ఆస్తుల పంపకాలు వంటి సమస్యలు స్థానికంగా పరిష్కరించుకోవాలని, అలా అయితే సమయం ఆదా అవ్వడంతో పాటు వ్యయం తగ్గుతుందన్నారు. మహిళల సంరక్షణకు అమలులో ఉన్న చట్టాలను మహిళలు సక్రమ మార్గంలో వినియోగించుకోవాలన్నారు. చట్టాలను దుర్వినియోగం చేస్తే సమాజంలో దుష్ఫలితాలు వచ్చే అవకాశం ఉందన్నారు. బాలలకు ప్రత్యేక హక్కులను రాజ్యాంగం కల్పించిందన్నారు. 14 ఏళ్ల లోపు చిన్నారులను పనిలో చేర్పించడం, వారితో పనిచేయించుకోవడం చట్టరీత్యా నేరమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కె.ఇందుమతి, తహసీల్దారు జి.వి.జనార్దన్, ఎంపీడీవో జి.పైడితల్లి తదితరులు పాల్గొన్నారు.

సక్రమంగా ఓటర్ల జాబితాలు

పాలకొండ: ఓటర్ల జాబితాలు సక్రమంగా సిద్ధం చేయాలని తహసీల్దార్ పి. సోమేశ్వరరావు అన్నారు. మండల కేంద్రంలో బీఎల్‌ఓలతో గురువారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఓటరు లిస్టులో ఉన్న ఫొటోలు సక్రమంగా లేకపోతే వాటి స్థానంలో కొత్త ఫొటోను జత చేయాలని సూచించారు. డబల్ ఎంట్రీలు ఉంటే తొలగించాలన్నారు. ఆయనతో పాటు టీడీ బుచ్చయ్య ఉన్నారు.

విద్యాసామర్థ్యాల పరిశీలన



ప్రశ్నలడిగి విద్యార్థుల విద్యాసామర్థ్యాలు పరిశీలిస్తున్న తహసీల్దార్ రమేష్‌కుమార్

కురుపాం: రుచి, శుచి కలిగిన భోజనం విద్యార్థులకు పెట్టాలని తహసీల్దారు ఆర్.రమేష్‌కుమార్ సూచించారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలను గురువారం సందర్శించిన ఆయన అక్కడి విద్యార్థుల కోసం సిద్ధం చేసిన మధ్యాహ్న భోజనం వంటకాలను రుచి, చూసి పరిశీలించారు. మెనూ ప్రకారం వంటకాలు వండాలని, పరిశుభ్రత పాటించాలని వంట నిర్వాహకులకు సూచించారు. అంతకుముందు తరగతుల వారీగా విద్యార్థుల వద్దకు వెళ్లి, వివిధ ప్రశ్నలు అడిగి, విద్యార్థుల విద్యాసామర్థ్యాలు పరిశీలించారు. బాగా చదువుకుని, ఉన్నత స్థాయికి చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు.

లక్ష్మీనృసింహ స్వామికి ప్రత్యేక పూజలు



సీతానగరం: మండల కేంద్రంలోని సువర్ణముఖీ నది ఒడ్డున వేంచేసిన లక్ష్మీనృసింహ స్వామి భక్తులకు ప్రత్యేక అలంకరణలో గురువారం దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు పీసపాటి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు గురువారం వేకువ జాము నుంచే లక్ష్మీనృసింహ స్వామిని ప్రత్యేక అలంకరణ చేసారు. దూర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులచే క్షీరాభిషేకాలు, కుంకుమ పూజలు అర్చకులు చేయించారు.

చేప పిల్లల పంపిణీ వేగవంతం

భామిని: జిల్లాలోని గిరిజనులకు ఐదు రోజుల్లో చేప పిల్లల పంపిణీ పూర్తి చేయాలని ఐటీడీఏ పీఓ పి. కల్పనాకుమారి అన్నారు. మండలంలోని వడ్డంగిగూడ చెరువులో సర్పంచ్ కొండగొర్రి ఉషారాణితో కలిసి పీఓ కల్పనాకుమారి గురువారం చేప పిల్లలను విడిచిపెట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఈ సీజన్‌లో వేగవంతంగా మత్స్య సంపద చేతికి అందేలా చూడాలన్నారు. ఐటీడీఏ ద్వారా జిల్లాలోని 454 చెరువుల్లో 12,98, 500 చేప పిల్లలను విడిచిపెట్టనున్నట్లు డివిజనల్ ఫిషరీస్ అధికారి జి. గోపీకృష్ణ తెలిపారు. కట్ల, రోహూ, ఎర్ర మిగల, తదితర రకాల చేపలను చెరువుల్లో నీటివ



వడ్డంగిగూడ చెరువులో చేపపిల్లలు విడిచిపెట్టుతున్న పీఓ కల్పనాకుమారి, తదితరులు

మత్స్య సంపదతో ఆర్థికంగా ఎదగాలి...

సీతంపేట: మత్స్య సంపదతో ఆర్థికంగా ఎదగాలని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కల్పనాకుమారి అన్నారు. మండలంలోని పులిపుట్టి పంచాయతీ పరిధిలో చెరువుల్లో 36 వేల చేప పిల్లలను విడిచిపెట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, చేపల పెంపకంతో గిరిజనులు అభివృద్ధి చెందాలని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డబ్బీరు గోపీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు. ఎట్టాలు తగ్గక ముందే వేయాలని సూచించారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ

వీరఘట్టం: మండల కేంద్రంలోని పీహెచ్‌సీకి వచ్చిన గర్భిణులకు చిట్టపులివలస జంక్షన్‌లో ఉన్న సత్యసాయిబాబా నిత్య అన్నదాన సేవా కేంద్రం నిర్వాహకులు గురువారం పౌష్టికాహారం పంపిణీ చేశారు. ప్రధాన మంత్రి మాతృత్వ అభియాన్‌లో భాగంగా వీరికి ప్రతినెలా పీహెచ్‌సీలో వైద్య తనిఖీలు చేస్తున్నారు. డాక్టర్ ప్రదీప్‌కుమార్, ఉమామహేశ్వరి గర్భిణులు పరీక్షించి, అవసరమైన మందులు అందజేశారు.

మందుగుండు విక్రయాలపై నిఘా..

పాలకొండ రూరల్: దీపావళి పండగ సందర్భంగా నిబంధనలకు విరుద్ధంగా జరగనున్న మందుగుండు విక్రయాలపై పోలీసులు నిఘా పెట్టారు. ఈ మేరకు ఎస్సై బి. శివప్రసాద్ ఆధ్వర్యంలో సిబ్బంది గురువారం రాత్రి పాలకొండ – విశాఖ, వీరఘట్టం, సీతంపేట, శ్రీకాకుళం రహదారుల్లో ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ, అనుమతుల్లేకుండా మందుగుండు విక్రయించకూడదన్నారు. ఇళ్లల్లో, జనావాసాల మధ్య మందుగుండు నిల్వ చేయవద్దని సూచించారు.



పాలకొండ- శ్రీకాకుళం రహదారిలో తనిఖీలు చేస్తున్న పోలీసులు

ఘనంగా న్యాయ సేవా దినోత్సవం

పాలకొండ రూరల్: చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలని స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు కార్యాలయ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు అన్నారు. జాతీయ న్యాయసేవా దినోత్సవం సందర్భంగా తమ్మినాయుడు విద్యాసంస్థల్లో గురువారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు ఎ.రఘురామ్, ఎం.శామ్యూల్, ఎం.వెంకటరమణ, ఎస్.సింహాచలం తదితరులు దిశ, ఈవ్‌టీజింగ్, గృహహింస, మానవ అక్రమరవాణా, తదితర అంశాలకు సంబంధించిన చట్టాలపై అవగాహన కల్పించారు.

తప్పులు సరిదిద్దాలి..

సీతంపేట: ఓటర్ల జాబితాలో ఎటువంటి తప్పిదాలు ఉన్నా త్వరితగతిన సరిచేయాలని ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి అన్నారు. గురువారం స్థానిక ఐటీడీఏలో భామిని, సీతంపేట మండలాల బీఎల్‌ఓలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నిబంధనల మేరకు మాత్రమే ఓటర్లను తొలగించాలన్నారు. అర్హత ఉన్నవారందరికీ ఓటుహక్కు కల్పించాలని సూచించారు. చనిపోయిన వారి ఓట్లను తొలగించే సమయంలో మరణ ధ్రువీకరణ పత్రం సరిచూసుకోవాలన్నారు. సూపర్‌వైజర్లు, బీఎల్‌ఓలు బాధ్యతగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో సీతంపేట, భామిని తహసీల్దార్లు ఎస్.నరసింహమూర్తి, ఎన్.అప్పారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి

జగనన్న ఆరోగ్య సురక్షతో మెరుగైన వైద్యం

జియ్యమ్మవలస: మండలంలోని తురకనాయుడువలస గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా శిబిరానికి హాజరైన రోగులకు వైద్యుడు కె.కార్తీక్ ఆరోగ్య తనిఖీలు చేసి, ఆరోగ్య సలహాలు, సూచనలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజారోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయని, ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



రోగుల ఆరోగ్యంపై ఆరా తీస్తున్న వైద్యుడు కార్తీక్